# బిచ్చగాడు

కొత్తగూడానికి దగ్గరుండే ఒక ఊర్లో మా బంధువులింట్లో జరిగిన పెళ్లి అటెండ్ చేసి తిరిగి వరంగల్‌కు బయల్దేరాను. కొత్తగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్ళే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌లో వెళితే ప్రయాణం సుఖంగా వుంటుందని తెల్లారకట్ల నాలుగ్గంటలకే లేచి నేను వెళ్ళిన ఊర్నించి నాలుగున్నరకు కొత్తగూడెం వెళ్ళే బస్సెక్కి కొత్తగూడెం చేరేటప్పటికి ఆరుంబావు అయింది. ట్రెయిన్ బయల్దేరటానికిక కేవలం పదిహేను నిముషాల టైమ్ మాత్రమే వుంది.

త్వరగా బస్సుదిగి స్టేషన్‌కు పరిగెత్తాను. వెంటనే టికెట్ తీసుకొని ట్రెయినెక్కాలన్న ఆతురతతో వున్న నేను బుకింగ్ ముందున్న చేంతాడంత క్యూను చూసి గతుక్కుమన్నాను. ప్లాట్‌ఫారం మీద ట్రెయిన్ రెడీగా వుంది, ఎట్టి పరిస్థితుల్లో కూడా యింకో పదిహేను నిముషాల్లో నాకు టికెట్ దొరకటం అసంభవమనిపించింది. అయినా చేసేదేమీ లేదు. కాబట్టి క్యూలో నిల్చున్నాను.

క్యూ చాలా మెల్లగా కదుల్తోంది. రెండు మూడు నిమిషాల్లోనే నా వెనుక మరో పదిమందిదాకా వచ్చి నిలుచున్నారు.

క్షణక్షణానికి నా ఓపిక నశించిపోతోంది... టికెట్ కలెక్టరుకు చెప్పేసి ట్రెయినెక్కేద్దామా అనుకున్నాను. ట్రెయిన్ బయలుదేరటానికి ఐదు నిమిషాలు మాత్రమే వుంది.

"మీరెక్కడకెళ్ళాలి సార్" అంటూ నన్నే పలకరించినట్లుగా వినిపించటంతో పక్కకు తిరిగాను. నీట్‌గా డ్రెస్ చేసుకున్న ఓ పాతికేళ్ళ యువకుడు నాకేసి చిరునవ్వుతో చూస్తూ–

"నన్ను గుర్తుపట్టలేదా సార్?" అన్నాడు.

"లేదు" అన్నాను, అతడెవరో గుర్తు చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ.

"నేను మీ స్టూడెంట్‌ని సార్. వరంగల్ ఆర్ట్సు అండ్ సైన్స్ కాలేజీలో చదివాను. ప్రస్తుతం పాల్వంచలో ఎస్.ఐ.గా పనిచేస్తున్నాను"

"నిజంగానా? నీపేరు" అన్నాను ఆశ్చర్యంగా. అతన్నింకా గుర్తు చేసుకోవటానికి ప్రయత్నిస్తూ–

"భాస్కర్ సార్! మీరు ఎందాక వెళ్ళాలో చెప్పండి సార్... టికెట్ తెప్పిస్తాను. టైంలేదు" అన్నాడతడు.

చేతిలో వున్న పదిరూపాయలనోటు అతని చేతికిస్తూ "వరంగల్" అన్నాను.

భాస్కర్ బుకింగు దగ్గరున్న కానిస్టేబుల్‌ను పిలిచి వరంగల్‌కొక టికెట్ తీసుకోమని చెప్పాడు. ఎక్కణ్ణించో అకస్మాత్తుగా ఊడిపడి నన్ను క్యూ నుండి విముక్తుణ్ణి చేసిన అతడెవరో పోల్చుకోవటానికి నా జ్ఞాపకశక్తి పెనుగులాడుతూనే ఉంది. నేను లెక్చరర్‌గా జాయినయినప్పట్నించి కొన్ని వందల మంది స్టూడెంట్స్ కాలేజిలోంచి డిగ్రీలు పుచ్చుకొని బయటకు వెళ్ళి ఉంటారు. ఎంతమందినని గుర్తుంచుకోవటం? బాగా ఒడ్డూ, పొడుగూ ఉన్న ఈ భాస్కర్ గుర్తొచ్చినట్టే వచ్చి మళ్ళీ మాయమైపోతున్నాడు. అకస్మాత్తుగా నా దృష్టి భాస్కర్ చేతిలో ఉన్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మీదకు మళ్ళింది. లాస్ట్‌పేజీలో ఉన్న గవాస్కర్ ఫోటో చూడగానే

"నువ్వు కాలేజీలో చదువుతుండే రోజుల్లో క్రికెట్ బాగా ఆడుతుండేవాడివి కదూ భాస్కర్?" అన్నాను బోల్డు రిలీఫ్‌తో.

"ఔనుసార్... యూనివర్శిటీ ప్లేయర్‌గా కూడా సెలక్టయ్యాను..."

"యెస్... నౌ ఐ రిమెంబర్ యూ వెరీవెల్... మన కాలేజీలో జరిగిన నువ్వాడిన ఒక క్రికెట్ మ్యాచ్‌లో నేను కొంతసేపు కామెంటరీ కూడా చెప్పాను..."

"ఔనుసార్..." అన్నాడతడు.

ఇంతలో కానిస్టేబుల్ టికెట్ తెచ్చిచ్చాడు.

భాస్కర్ చేతిలోంచి ఆ టికెట్ అందుకుంటూ

"థాంక్యూ భాస్కర్... థాంక్యూ వెరీమచ్" అన్నాను.

"మీరు వెళ్ళండిసార్ ట్రెయిన్ పూర్తిగా నిండిపోయింది. మీకు సీటు దొరుకుతుందో లేదో..." అన్నాడతడు.

"నువ్వు రావటం లేదా భాస్కర్?" అన్నాను.

"లేదుసార్... మా ఫ్రెండొకతన్ని సెండాఫ్ చెయ్యటానికొచ్చాను..." అన్నాడు భాస్కర్.

అతనికి మరోసారి థాంక్స్ చెప్పి ప్లాట్‌ఫాంమీదకు పరిగెత్తాను. బుకింగ్ దగ్గర టికెట్లకోసం జనం పోట్లాడుకోవటం భయంకరంగా మారింది. ఆ తొక్కిసలాట లోంచి అంత త్వరగా బయటపడినందుకు నన్ను నేను అభినందించుకుంటూ ప్లాట్‌ఫారం మీదకు చేరి సీటుకోసం ఒక కంపార్ట్‌మెంట్ తర్వాత మరో కంపార్ట్‌మెంట్ వెతకసాగాను. ఎక్కడా సీటు దొరికే ఆశ కనిపించలేదు. ఇక వెతకటం వల్ల ప్రయోజనం లేదని ఒక కంపార్ట్‌మెంట్ ఎక్కేసి ఎక్కడైనా కాస్త చోటు దొరుకుతుందేమోనని, మళ్ళీ ఎవరైనా భాస్కర్‌లాంటి వాళ్ళు కలిసి సీటిస్తారేమోనని లోపల కూర్చున్న వాళ్ళందర్నీ ఒకసారి

పరీక్షించాను. నన్నెవరూ ఆహ్వానించేవాళ్ళు కనిపించలేదు. కాని నా దృష్టి ఒక సీటుమీద పడింది. ఐదుగురు సులభంగా కూర్చోగల్గిన ఆ సీటు మొత్తాన్ని ఒకావిడ బోల్డు లగేజ్‌తో ఆక్రమించుకుంది. ఆ లగేజ్‌ని కొంచెం అటు యిటూ జరిపితే అక్కడ ఈజీగా కూర్చోవచ్చునని ఆ సీటు దగ్గరకెళ్ళాను.

అక్కడ కూర్చున్నామె ఎవరో చాలా పేదరాలిలా ఉంది. చిరిగి వేలాడుతున్న బట్టపీలికల్ని కట్టుకున్న ఆమె బిచ్చపుదానిలా వుంది. ఆమెకు ఎదురుగా ఉన్న సీటుమీద ఇద్దరమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు కూర్చొని ఉన్నారు. వాళ్ళ శరీరాల మీదకూడా చిరిగిపోయిన బట్టపీలికలు వేలాడుతున్నాయి. వాళ్ళు ఆమె సంతానమని గ్రహించటానికి నాకెంతో టైమ్ పట్టలేదు. వాళ్ళంతా చాలా మురికిగా, అసహ్యంగా వున్నారు. వాళ్ళ శరీరాల నుండి వెలువడుతున్న చెమటకంపు దుర్భరంగా ఉంది. వాళ్ళ పక్కన కూర్చోవట మంటే చాలా భయమేసింది. కానీ మరో గత్యంతరంలేదు. మూడు గంటలు నిల్చోవటం కంటే ఎలాగో అలా వాళ్ళ పక్కన కూర్చోవటమే నయమనిపించింది.

"ఇదిగో ఇటు చూడు... ఈ సామానంతా కిందపెట్టేస్తే ఇక్కడ ఇంకో ఇద్దరు ముగ్గురు కూర్చోవచ్చు" అన్నాను ఆమెతో చాలా మర్యాదగా...

"గదంతేం లేదు... మేము సామాను తియ్యం... ఇంకో డబ్బలకు బోయి కూకో... మేమే దొరికినమా?" అందామె చాలా మొరటుగా. తైల సంస్కారం లేక వరిగడ్డిలా ఉన్న వెంట్రుకలు... గారపట్టిన పళ్ళు... లోతుకు పీక్కుపోయిన చిన్నచిన్న కళ్ళు... గర్భంతో ఉందని చాటిచెబుతున్న ఆమె పొట్ట... ఎందుకో ఆమెను చూస్తే మొత్తం స్త్రీజాతిమీదనే అసహ్యం కల్గే ప్రమాదముందనిపించింది. వెంటనే అక్కణ్ణించి వెళ్ళిపోదామనుకున్నాను. కాని అక్కడ కూర్చున్న ప్రయాణీకుల్లో ఒకాయన

"అధునా బిచ్చపుముండవు... నీకే గింత పొగరుంటే మాకెంతుండాల్నే? ఆ సారెంత మర్యాదగా అడిగిండు? సామాను కొంచెం కిందబెడ్తె మాసిపోతాదే! ఈ రైలు నీ తాతదనుకున్నవా? తండ్రిదనుకున్నవా? ఆ చెత్తంతా తీసి కిందబెట్టి సారును కూర్చోనియ్" గద్దించినట్టుగా అన్నాడు. ఆయన వేసుకున్న ఖద్దరు బట్టల్ని బట్టి చూస్తే ఆయనెవరో పెద్ద రాజకీయ నాయకుడిలా ఉన్నాడు.

ఆయనలా జోక్యం చేసుకోవటంతో ఆమె కాస్త తగ్గింది. సీటుమీదున్న ఎన్నో మూటల్లోంచి ఒక మూటను మాత్రం తీసి కిందబెడ్తూ-

"మావోడు టిక్కెట్లుకు బోయిండు... అడొత్తే సీటుకావద్దా? ఆడికోసమే ఆపినం" అందామె నన్నక్కడ కూర్చోమన్నట్టుగా చూస్తూ-

పైన సూటుకేసు పెట్టి ఆ కాస్తచోటులో సర్దుకుని కూర్చున్నాను. నా ముందు సీట్లో కూర్చున్న ఆమె పిల్లలందరూ నావైపు శత్రువును చూసినట్టుగా చూస్తున్నారు. వాళ్ళు ఎంతో కష్టపడి నిర్మించుకున్న వాళ్ళ ఆ భూభాగం మీద నేను దురాక్రమణ చేశానన్నట్టుగా ఆ పసిపిల్లలు నన్ను చూస్తున్నారన్న భావం నా మనసులో మెదలటంతో కొంచెం గిల్టీగా ఫీలయ్యాను.

అక్కడ సీటుమీద, కిందా కుప్పలుతెప్పలుగా పడివున్న వాళ్ళ లగ్గేజి నొకసారి పరీక్షగా చూశాను. వాళ్ళు ఎక్కణ్ణించో బిచాణా ఎత్తేసి మరో చోటికి వెళ్ళిపోతున్నట్లుగా తోచింది. వంటపాత్రలు, చింకిచాపలు, బొంతలు, మంచం పట్టెలు, కోళ్ళు, పాత గొడుగులు, లాంతర్లు, ఖాళీసీసాలు, కిరోసిన్ డబ్బా, పొయిలకట్టెలు – ఇలా యేవేవో అస్తవ్యస్తంగా పడిఉన్నాయి.

ఇంతలో గార్డు విజిల్ వినిపించింది. టైమ్ చూశాను. ఆరు ముప్పయి ఐదు. ఐదు నిముషాలు లేటు. మరుక్షణంలో రైలు కూసింది.

"మీ అయ్యేడ్రా? ఎక్కడ సచ్చిందురా?... రైలుపోతాంది..." ఆతురతగా, ఆందోళనగా ధ్వనించింది ఆమె గొంతు.

టికెట్లకోసం వెళ్ళిన ఆమె భర్త ఇంకా రాలేదు.

కిటికీలోంచి బయటకు చూశాను. బుకింగ్ దగ్గర ఇంకా జనం చాలామందే వున్నారు.

ఇంతలో ఒక మధ్యవయస్కుడు మేము కూర్చున్న కంపార్ట్‌మెంట్‌వైపు పరుగెత్తుకొని రావటం గమనించాను. అతన్ని చూడగానే నా ముందు కూర్చున్న పిల్లలు లేచి నిల్చొని సంతోషంతో కేరింతలు కొడ్తూ–

"అయ్యొస్తాండు... అయ్యొస్తాండు" అని అరిచారు.

పరుగెత్తుకొస్తున్న ఆ వ్యక్తి లబోదిబోమని మొత్తుకుంటూ "టిక్కెట్లు దొరకలేదు... బండిపోతాంది. సామానంతా కిందికి దించి మీరు దిగుండ్రే" అంటూ అరుస్తున్నాడతడు.

ఆమాట వినగానే ఆ పిల్లలూ, ఆమె పెద్దపెట్టున యేడ్వసాగారు.

మళ్ళీ ఇందాకటి పెద్దమనిషే జోక్యం చేసుకున్నాడు.

"అరెవోరి పిచ్చిగాడిద కొడుకా! నీ ఈ బండెడు సామను దించేదాకా బండి ఆగుతాదిరా! టిక్కెట్లు లేకుండ ఏమనుకోని ఎక్కినవురా?... టి.టి.గారితోని చెప్పి ఎక్కుపో" అన్నాడు...

"అక్కడ మావోనికి టిక్కట్లు తీసుకోమని పైసలిచ్చొచ్చినయ్యా! ఇప్పుడు నేను బండెక్కితే ఆ పైసలటేపోవు?" అన్నాడతడు మళ్ళీ బుకింగ్ దగ్గరకు పరిగెడ్తూ...

ట్రెయిన్ మళ్ళీ విజిలిచ్చి, మెల్లిగా కదిలింది.

అతడు ట్రెయినెక్కకుండా మళ్ళీ బుకింగ్ దగ్గరకు పరుగెత్తటంతో అతని పిల్లలు, అతని భార్యా మళ్ళీ పెద్దపెట్టున యేడవసాగారు.

"మీరుకూడా దిగిపోవటం మంచిది... టి.టి. వచ్చిండంటే మీమీద బోల్డు ఫైనేస్తడు" అన్నారు ప్రయాణికుల్లో మరొకరు-

"ఇంత లగేజి పెట్టుకొని ట్రెయిన్ మూవయ్యాక ఎలా దిగుతారండి?" అన్నాన్నేను.

"ఆడు పోతేపోయిండులే... మళ్ళొచ్చే బండ్లో వస్తడు, దబ్బున టి.టి. వస్తే ఫైన్ కట్టటానికి నీదగ్గర పైసలేమన్న ఉన్నయ్యా? లెవ్వా?" అన్నాడు ఇందాకటి నాయకుడు.

"అయ్య దొరో! ఒక్క పైసన్నా లేదు బాంచెను" అందామె యేడుస్తూనే-

"నువ్వట్లనే అంటవు... ఇయ్యాళ్రేపు బిచ్చగాళ్ళ దగ్గరున్నన్ని డబ్బులు మా అసంటోళ్ళ దగ్గరకూడా ఉంటలేవు... మీకేందే- పెట్టుబడిలేని వ్యాపారం" అన్నాడతడు.

అక్కడ కూర్చున్నవాళ్ళంతా నవ్వారు.

"పాపం... వాళ్ళలా బిక్కచచ్చి యేడుస్తుంటే మీరిలా నవ్వటమేమిటి?" అని వాళ్ళందర్నీ గద్దించాలనిపించింది. కాని నేనలా అంటే వీడెవడో పిచ్చివాడులా ఉన్నాడని వాళ్ళంతా మళ్ళీ నవ్వుతారేమోనని భయమేసి ఊరుకున్నాను.

ట్రెయినింకా వేగాన్ని పుంజుకోలేదు.

ఇందాక టికెట్లకోసం వెళ్ళిన ఆమె భర్త ఫ్లాట్‌ఫాంమీద వేగంగా పరుగెత్తుకొని రావటం చూశాం... యేడుస్తున్న అతని పిల్లలు వాళ్ళ తండ్రిని చూడగానే యేడ్వటం మానేసి "రా అయ్యా! రా అయ్యా!" అని అరిచారు.

అతడు పరుగెత్తుకొనివచ్చి ఆ కంపార్ట్‌మెంట్ ఎక్కేశాడు. ఆ పిల్లల గుండెలు కుదుటపడ్డాయి. అతడు మేము కూర్చున్న సీటు దగ్గరకు వచ్చాడు.

అతడు విపరీతంగా వగురుస్తున్నాడు...

అతనికి యాభయ్యేళ్ళుండొచ్చు... తలకు రుమాలు చుట్టుకున్నాడు. బాగా పెరిగిన గడ్డం, సగం నెరిసింది. గుబురుగా పెరిగిన మీసాలు - చింతనిప్పుల్లా ఎర్రగా మండుతున్నట్టున్న కళ్ళు - అతన్ని చూస్తే చాలాకాలంగా ఏదో జబ్బుతో పెనుగులాడు తున్నట్టుగా తోచింది.చాలా చోట్ల గంతలుపడిన బనియన్, మోకాళ్ళపైకి కట్టుకున్న పంచె... అతడు దగ్గరకు రాగానే చుట్టకంపు...

అతన్ని చూడగానే అతని భార్య

"టిక్కట్లు దెచ్చినవా?" అంది.

"ఎక్కడ దెచ్చిన? తెస్తనని అటురికెటోర్కె బండి కదిలె... బండి కదలంగనే నేను మళ్ళ ఇటు మర్లిన... టిక్కట్లు బోయినయి... పైసలు బోయినయి..." అన్నాడతడు.

"ఇప్పుడు టి.టి.వస్తే యేంజేస్తవురా" అన్నాడు నాయకుడు.

"రెండు కాళ్ళు బట్టుకుంట..."

"రెండు కాళ్ళు బట్టుకుంటె ఆయన ఊరుకుంటాడ్రా"

"మరిగంతకన్న నా దగ్గరేముందయ్యా?" అన్నాడతడు.

"మీపనే బావుందిరా... ఎక్కడా బిచ్చమే... పైసా ఖర్చులేని బ్రతుకు"

ఆ సంభాషణలో ఇంకా చాలామంది ప్రయాణీకులు పాల్గొనటం మొదలెట్టారు.

"ఊళ్ళన్నీ వాళ్ళవే... దేశాలన్నీ వాళ్ళవే... దొరికితే తింటారు. లేకపోతే పస్తుంటారు. యే బాదరబందీ లేదు, మనకంటె వాళ్ళే నయం" అన్నాడు ప్రయాణీకుల్లో ఒకరు.

"ఆమధ్య పేపర్లో చదివాను. బిచ్చగాళ్ళక్కూడా బ్యాంకు ఎకౌంట్లట... ఒక్కొక్కడి పేర ఐదువేలు... పదివేలు ఉన్నాయిట..." అన్నాడు మరొకాయన.

"టి.టిగాని వస్తే వీళ్ళచేత ఫైన్ కట్టించటమో లేక పక్క స్టేషన్లో దించటమో తప్పనిసరి" – ఇంకొకాయన.

"ముదనష్టపోడు... గంట సేబ్బోయిండు... టిక్కట్టు తేకుండనే వచ్చిండు... పైసలు కూడా ఎవనికో ఇచ్చొచ్చిండట..." అంటూ రాగాలు తీయసాగింది అతని భార్య.

"టికట్ల దగ్గర జనమంత ఇరగబడ్డరు... నన్నేం జెయ్యమంటవే... మనతో రాలే... మా అన్నకొడుకు... పైసలు ఆడికిచ్చిన టికట్లు తీసుకోమని... నేనేమో బండిని జూత్తూ నిలబడ్డ..." అన్నాడతడు.

"అయ్యో నీ చేతులిరిగిపోను! పైసలా దొంగసచ్చినోనికిచ్చినవా? ఆడినెట్ట నమ్మినవయ్యా... అయ్యో! అయ్యో! ముప్పైరూపాయలు!" అతని భార్య గుండెలు బాదుకోసాగింది.

"ఆ టిక్కట్లకు బోయినోడు కూడా మీతో రావలసినోడేనా? " అడిగాడు నాయకుడు.

"కాదు బాంచెను. ఆడు పాలంచలో ఉంటడు. మమ్ముల బండెక్కిత్తనని వచ్చిండు. ప్యాణం బాగాలేక దవాఖాన కొచ్చిన బాంచెను. రెండు నెల్లనుంచి దగ్గు... ఒకటే దగ్గు..." అంటూ అతడు ఖంగు ఖంగుమని దగ్గటం మొదలెట్టాడు.

"ఆ దా ముప్పై రూపాయలు తీసుకొని సారాకొట్టుకు బోతడు. నీకు ఒక్క పైసా కూడా జూపించడు" అంది అతని భార్య.

"ఆడసంటోడు కాదులేవే... ఆదు టిక్కెట్లు తీసుకుంటడు..."

"బండిబొయినంక టిక్కెట్లు తీసుకొని యేంలాభంరా? టిక్కెట్లు తీసుకున్నగని బండిబోయింది అని వాడు స్టేషన్ మాష్టరు కన్నా చెప్తే ఫర్వాలేదు. కాని వాడికామాత్రం తెలుసా అని?" అన్నాడు నాయకుడు.

ఇంతలో ఏదో స్టేషనొచ్చింది.

ట్రెయిన్ ఆగింది. మా కంపార్ట్‌మెంట్‌లోకి టి.టి.ఐ. రానే వచ్చాడు.

టి.టి. వచ్చాడని తెలియగానే ఆమె ఏడ్వటం మొదలెట్టింది. ఆమెనుచూసి వాళ్ళ పిల్లలు కూడా యేడ్వటం మొదలెట్టారు.

"ఇక్కన్నే... ఈ అడవిన్లేదింపేస్తడు" అన్నాడు ప్రయాణికుల్లో ఒకాయన.

"అంత పనిచెయ్యడ్లే... పక్కస్టేషన్ల దింపుతడు" అన్నారింకొకరు.

ఒక్కొక్క ప్రయాణికుని దగ్గర టిక్కెట్ చెక్ చేస్తూ టి.టి.గారు మా వరుసకి రానే వచ్చాడు. అక్కడ కూర్చున్నవాళ్ళంతా టిక్కెట్లు చూపించారు.

ఆ బిచ్చగాడు మాత్రం చేతులు జోడించాడు.

"దండం పెట్టాల్సింది నాక్కాదురా! పైన వున్న దేవుడికే... దొంగవేషాలు చాలించి చూపించు టిక్కెట్లు" గద్దించాడు టి.టి.ఐ.

"అయ్యా! టిక్కెట్ల కోసమే బోయినయ్యా... ఇయ్యాళ కొత్తగూడెం టేషన్లో అంతా మందే... టిక్కెట్లు తీసికోమని మా అన్నకొడుకుని బంపిన... ఆడు చెయ్యి బెట్టుండగనే బండి కదిలింది... నేను ఆణ్ణి వదిలేసి బండెక్కిన..."

అతడింకా చెబుతూనే వున్నాడు. కాని ఆ రైల్వే అధికారి అతని మాటల్ని వినిపించుకోలేదు.

"నోర్ముయిరా దొంగవెధవ! మీ సంగతి మాకు బాగా తెలుసురా! ఎక్కడి కెళ్ళాలి మీరు?" అన్నాడు టి.టి.ఐ.

టి.టి.ఐ. మధ్య వయస్కుడు. ఇలాటి విషయాల్లో చాలా అనుభవమున్న వాడిలా కనిపించాడు. బాగా దురుసుగా, కఠినంగా మాట్లాడటం అతనికి చాలా సహజమైన విషయంగా కనిపించింది.

"నెక్కొండ బాంచెను" అన్నాడతడు.

"ఆ ఆడది, ఆ నల్గురు పిల్లలు నీ వాళ్ళేనా" అన్నాడు టి.టి.ఐ.

"అయ్యా! మావోళ్ళే"

"అయితే 56 రూపాయలు తియ్..."

అతడు వెంటనే టి.టి.ఐ. గారి రెండు కాళ్ళూ గట్టిగా పట్టుకున్నాడు.

"లే గాడిదకొడుకా! నా కాళ్ళెందుకురా పట్టుకుంటావు? మర్యాదగా పైసలు తీస్తవా? పోలీసులకు పట్టించమంటవా?"

"నన్ను కోసినా నా దగ్గర పైసలేదు బాంచెను... ఉన్న పైసలన్నీ ఆడికే ఇచ్చొచ్చిన" అన్నాడతడు.

"ఆడెవడు?"

"మా అన్న కొడుకని చెప్పలేదుండ్రి... టిక్కెట్లు దీసుకోమని ఆడికి ముప్పై రూపాయలిచ్చిన్నుండి..."

అతడు మళ్ళీ అతని కాళ్ళు పట్టుకోబోయాడు. కాని అతడు దూరంగా జరిగి "నీ ఎత్తులన్నీ నా దగ్గర సాగవురా? 56 రూపాయలు తీస్తవా లేదా?" అన్నాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఆ బిచ్చగాడి నెలాగైనా ఆదుకోవాలనిపించింది.

"టి.టి.ఐ.గారూ! అతడు చెప్పింది వినిపించుకోరేమిటి? ఈరోజు నిజంగానే కొత్తగూడెంలో బుకింగ్ దగ్గర విపరీతమైన రష్‌గా వుంది. అతడెవరికో డబ్బిచ్చాట్ట... అతడు టిక్కెట్లు తెచ్చేలోగానే ట్రెయిన్ కదిలింది. అతడి భార్యాపిల్లలు, లగేజి, ట్రెయిన్‌లో ఉండిపోయారన్న తొందర్లో అతడు ట్రెయినెక్కేశాడు..." అన్నాను ఇంగ్లీషులో.

నేను ఇంగ్లీషులో మాట్లాడడంతో టి.టి గారి కాఠిన్యం కొంచెం సడలింది.

"అయితే ఒకపని చేద్దాం. వచ్చే స్టేషన్ నుండి నేను కొత్తగూడెం స్టేషన్ మేష్టరుకి ఫోన్ చేస్తాను. ఎవరైనా నెక్కొండకు తీసుకున్న టికెట్స్ రిటర్న్ చెయ్యటానికి వచ్చారా అని అడుగుతాను... వీడిమాటే నిజమయితే ఆ టిక్కెట్లు రిటర్న్ రావాలికదా? రిటర్నొచ్చాయని స్టేషన్‌మాష్టరు చెబితే వీడికి సమస్యే వుండదు. ఒరే నీ పేరేమిట్రా? అన్నాడు టి.టి.ఐ.

"బ్రహ్మయ్య బాంచెను" అన్నాడు బిచ్చగాడిలా కనిపిస్తున్న వ్యక్తి.

"నువ్వు కొత్తగూడెంలో డబ్బిచ్చినతని పేరేమిటి?"

"సోమయ్య బాంచెను" అన్నాడు బ్రహ్మయ్య.

"అయిదు నిముషాల్లో వీడు నాటకమే ఆడుతున్నాడో... నిజమే చెబుతున్నాడో తేల్చేస్తానుండండి" అన్నాడు టి.టి.ఐ.

కంపార్ట్‌మెంట్‌లో అందరూ యీ విషయాన్నే చర్చించసాగారు.

"వాడికి టికట్లు రిటర్న్ చెయ్యాలని తెలుసో తెలీదో – బండెల్లిపోయింది కదా అని వాడూ వెళ్ళిపోయుంటాడు" అన్నాడొకాయన.

"అబ్బో! ఇవ్వాళరేపు అంత అమాయకులెవరూ లేరులెండి..." అన్నాడింకొకాయన.

ఇంతలో మరో స్టేషన్ రానేవచ్చింది.

"వరే బ్రహ్మయ్యా! రారా" అంటూ అతన్ని తనవెంట బయటకు తీసుకెళ్ళాడు టి.టి.ఐ.

ఆ కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్న ప్రయాణీకులందరూ యేమౌతుందోనని ఆతురతతో ఎదురు చూడసాగారు.

"ఆఁ! వానికి గంత తెలివెక్కడేడ్చింది. బండి వెళ్ళిపోయిందని టిక్కెట్లు జేబుల బెట్టుకొని వెళ్ళిపోయుంటాడు"

"వాడసలు టిక్కెట్లు తీసుకోనే తీస్కోడు. బండి కదిలింది చూసి డబ్బులు జేబులో వేసుకొని యెల్లిపోయినాలె"

అందరూ ఎవరికి తోచినట్టుగా వాళ్ళు మాట్లాడటం మొదలెట్టారు.

"వాడు గసుంటోడే బాంచెను. సారా కొట్టుకు బోయినాలె" అంది బ్రహ్మయ్య భార్య.

ఐదారు నిముషాల్లో ట్రెయిన్ కదులుతుండగా బ్రహ్మయ్యతోబాటు టి.టి.ఐ. ట్రెయినెక్కారు.

"నేను చెప్పలేదండి అంతా నాటకమని. ఎవ్వరూ టిక్కట్లు రిటర్న్ చెయ్యటానికి రాలేదని కొత్తగూడెం స్టేషన్ మాస్టర్ చెప్పాడు. అరే బ్రహ్మయ్యా! తియ్‌రా డబ్బు!" అన్నాడు టి.టి.ఐ.

బ్రహ్మయ్య భోరుమని యేడ్వసాగాడు. అతనితోపాటే అతని భార్య, పిల్లలు కూడా యేడ్వటం మొదలెట్టారు.

"ఇలా యేడ్చి అల్లరి చేశారంటే చర్మం వలిపించేస్తాను... డర్టీ స్కౌండ్రల్స్... రోగ్స్... నోర్ముయ్యండి" గట్టిగా అరిచాడు టి.టి.ఐ. ఆ అరుపు వాళ్ళను హడలగొట్టింది. వాళ్ళంతా వెంటనే యేడ్వటం మానేశారు.

"వరేయ్ బ్రహ్మయ్యా! డబ్బు తియ్యరా" మళ్ళీ అన్నాడు టి.టి.ఐ. మళ్ళీ.

"అయ్యా! నన్ను కోసినా నా వద్ద ఒక్క పైసా లేదయ్యా..." అంటూ బ్రహ్మయ్య మళ్ళీ టి.టి.గారి కాళ్ళు పట్టుకోబోయాడు.

"నన్నంటుకున్నావంటే చంపేస్తాను... బద్మాష్! లుచ్చా! నీ దగ్గర డబ్బు లేదురా! ఆ రుమాలు తియ్" అన్నాడు టి.టి.ఐ.

వెంటనే టి.టి.ఐ.తో వచ్చిన మరొకతడు – అతని అటెండరనుకుంటాను– బ్రహ్మయ్య తలకు చుట్టుకున్న రుమాలును లాగబోయాడు.

బ్రహ్మయ్య వెనక్కి జరిగి రెండు చేతుల్తోను తన రుమాలును గట్టిగా పట్టుకున్నాడు.

"గీ రుమాల్నేముంది బాంచెను... మీ అసుంటి ఓ దొర దగ్గర ఆడుక్కున్న.. నన్ను నమ్ముండ్రి బాంచెను. వచ్చేటేషన్‌లో దింపుండ్రి బాంచెను..." అంటూ ఖంగు ఖంగుమని భయంకరంగా దగ్గాడు బ్రహ్మయ్య. కాని అతని మాటల్ని వినిపించుకోకుండా ఆ రైల్వే అధికారి ముందుకు జరిగి బ్రహ్మయ్య రుమాలును లాగబోయాడు. తన శక్తినంతా కూడదీసుకుని బ్రహ్మయ్య తన తల మీది రుమాలును రక్షించుకోబోయాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు. వాళ్ళిద్దరికి జరిగిన ఆ పెనుగులాటలో బ్రహ్మయ్య రుమాలు చిరిగిపోయింది. అందులోనుంచి మూడు పది రూపాయల నోట్లు కిందపడ్డాయి. వాటిని చూడగానే టి.టి.ఐ.గారి కళ్ళు మెరిశాయి. ప్రయాణీకులంతా ఆ నోట్లుకేసి కళ్ళప్పగించి చూశారు. ఇంతసేపు వాళ్ళ హృదయాల్లో బ్రహ్మయ్యపట్ల యేకొంచెమన్నా సానుభూతి యేర్పడి ఉంటే అది ఆ క్షణంలో యెగిరిపోయింది.

"దొంగముండకొడుకులు. వీళ్ళను చచ్చినా నమ్మొద్దు. టి.టి.ఐ. గార్కి వీళ్ళ సంగతి బాగా తెలుసు. మంచి పని జేశిండు" అన్నాడు తెల్ల బట్టల నాయకుడు–

ఆ క్షణంలో అక్కడ కూర్చున్న మిగతా వాళ్ళందరూ సరిగ్గా అలాగే అనుకొని వుంటారు.

టి.టి.ఐ.తో ఉన్న అటెండర్ ఆ మూడు పదిరూపాయల నోట్లను తీసి టి.టి.గారి చేతిలో పెట్టాడు. అతడు వెంటనే ఆ డబ్బును జేబులో కుక్కుకొని–

"ఈ ముప్పై రూపాయలే కదురా నువ్వు టికెట్లు తీసుకోమని మీ అన్నకొడుక్కిచ్చావు?" తన కంఠంలో సాధ్యమైనంత వెటకారాన్ని మేళవించి అన్నాడు టి.టి.

ప్రయాణీకులంతా గొల్లున నవ్వారు.

"కాదు మహాప్రభో! కాదు... ఆడికిచ్చిన డబ్బు ఆడిదగ్గరే ఉండి పోయింది..."

"ఛట్! దొంగరాస్కెల్... ఇంకా మోసం చెయ్యాలని చూస్తున్నావా? తియ్... మిగతా 26 రూపాయలు కూడా తియ్..."

"మమ్ములకొట్టుండ్రి... చంపుండ్రి... ఈ బండ్లెనించి బయటకు ఇసిరి కొట్టుండ్రి... మావద్దిక పైసల్లేవు" ఈసారి బ్రహ్మయ్య భార్య అంది.

"నోర్ముయ్యవే దొంగముండా! పైసల్లెవంటే ఫైనెవడుకడ్తడనుకున్నవ్...? నీ నడుముకున్న ఆ సంచి తియ్..." అన్నాడు టి.టి.ఐ.

"దాంట్లేముంది బాంచెను... నిన్న మొన్న ఆడుకున్న బిచ్చపుడబ్బులు" అంది బ్రహ్మయ్య భార్య.

"ఏముందో నేను జూస్తాను... అదిటివ్వు" అన్నాడు టి.టి.ఐ.

"ఈపూటకు నూకలమందమన్నా ఉంచుండ్రయ్యా!... నిన్నా మొన్నా... యేమీ తిన్లేదు... ఆడు రోగంతో తీసుకొని తీసుకొని సచ్చిపోతాండు... నా పోరగాళ్ళను సూడుండ్రి... ఆకలితో నకనకలాడిపోతాండ్రు... మీకాళ్ళు పట్టుకుంట బాంచెను..."

ఆమె లేచి అతనివైపు వెళ్ళబోయింది.

నిండు చూలాలుగా ఉన్న ఆ నిర్భాగ్యురాల్ని చూస్తే అక్కడ కూర్చున్న వాళ్ళకెవరికీ జాలి కల్గకపోగా వీళ్ళకిలాగే జరగాలన్న ద్వేషపూర్తిమైన భావమేదో వాళ్ళల్లో కల్గటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇలాంటి దృశ్యాన్నే యే సినిమాలోనో చూపిస్తే వీళ్ళంతా కంటతడి పెడ్తారు. ఈ మనుషుల్లోని ఈ వైరుధ్యాలకు కారణమేమిటి? "మేమంతా టికట్లుకొన్నాము. వీళ్ళేమో టికెట్లు కొనకుండా ప్రయాణం చేస్తున్నారు. మనకులేని ప్రివిలేజిని వీళ్ళెందుకు పొందాలన్న ఈర్ష్య కావచ్చు వీళ్ళల్లోని ద్వేషభావానికి కారణం. టికట్లుకొన్న ప్రయాణీకులకు, కొనని ప్రయాణీకులకు మధ్య ఇలాంటి ఘర్షణ తప్పదేమో! ఆ క్షణంలో వీళ్ళంతా 'మేము ప్రయాణీకులం' అనే విషయాన్ని మరచిపోలేరు. అదే సినిమా చూస్తున్నప్పుడు, సినిమాలో ఇలాంటి దృశ్యం చూసినప్పుడు వీళ్ళు ప్రయాణికుల్లా ఆలోచించరు – సహజంగా మానవుల్లో ఉన్న దయ, సానుభూతి, జాలి వాళ్లల్లో ఆ క్షణంలో జాగృతం అవుతాయనుకుంటాను.

నేనిలా ఆలోచిస్తుండగానే టి.టి గారు ఆమె నడుముకు చెక్కుకున్న చాలా మురికిగా వున్న చిన్న సంచీ లాంటిదాన్ని లాక్కున్నాడు.

అందులో వున్న డబ్బంతా కిందపోశాడు. కొన్ని ఒకరూపాయి నోట్లు, కొన్ని ఐదురూపాయల నోట్లు, మిగతా అంతా చిల్లర – పైస, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, పదిపైసలు మొదలైన చిల్లర పైసలు... టి.టి.ఐ.గారు చకాచకా ఆ డబ్బు లెక్కపెట్టేసి అందులోంచి ఇరవైఆరు రూపాయలు తీసుకున్నాడు. రెండు పదిపైసలు, మూడు ఐదుపైసలు, పది రెండు పైసలు తప్ప అక్కడింకేమీ మిగల్లేదు. వాటిని తీసి టి.టి.గారితో వున్న అటెండర్ ఆమెకివ్వబోయాడు.

"వాట్నికూడా ఆర్నే తీసుకోమనురి" అందామె రోషంగా. ఆ మాటతో టి.టి.ఐ. గారు కస్సుమనిలేచాడు. "చెప్పుతీసుకొని తంతాను దొంగముండా! నీ ముదనష్టపు బిచ్చమెత్తిన డబ్బు నేనెందుకు తీసుకుంటానే! పుణ్యానికొచ్చిన తిండి తిని బాగా కొవ్వెక్కింది ముండకు- పోలీసులకు అప్పజెప్పి లాకప్‌లో వేయించి నాల్గురోజులు బాగా తన్నిస్తేగాని బుద్దొస్తుందే మీలాంటి వాళ్ళకు" అన్నాడు టి.టి.ఐ. గారు పళ్ళుకొరుకుతూ.

బ్రహ్మయ్య వెళ్ళి ఆ చిల్లర డబ్బులు తీసుకొని "ఎడ్డిముండబాబు... దానికేమెరుక... చమించుండ్రి బాబూ!" అన్నాడు చేతులు జోడించి.

ఇంతసేపు నిల్చొనే మాట్లాడిన టి.టి.గారు నన్ను కొంచెం జరగమని రిక్వెస్ట్ చేసి నాపక్కన కూర్చొని జేబులోంచి రసీట్‌బుక్ లాంటిది తీశాడు. పెన్సిల్‌తో చకాచకా ఏదో రాశాడు.

ఇంతలో డోర్నకల్ స్టేషన్ వచ్చేసింది.

అతడు రాసిన కాగితాన్ని చించి "ఇదిగో ఈ రిసీట్ దగ్గరుంచుకొని నెక్కొండలో మీరు దిగినప్పుడు చూపించండి" అంటూ దాన్ని బ్రహ్మయ్య చేతిలో కుక్కుతుండగా నా దృష్టి ఆ కాగితంమీద పడింది- "22 రూపాయలు... డోర్నకల్ టు నెక్కొండ" - అంతవరకే కనిపించింది.

నాకేదో అర్థమైనట్టుగా తోచింది.

ట్రెయిన్ డోర్నకల్ స్టేషన్లో ఆగింది.

టి.టి.ఐ. వెంటనే ఆ కంపార్ట్‌మెంట్‌లోంచి దిగిపోయాడు.

నాకర్థమైన విషయమేమిటో అక్కడ కూర్చున్న ప్రయాణికులందరికీ చెబుదామనుకున్నాను. కాని ఇలాంటివన్నీ ఎంతో మామూలైపోయిన ఈ దేశంలో నేనా విషయాన్ని వాళ్ళకు చెప్పటం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని నాకు తెలుసు.

చాలాసేపు బ్రహ్మయ్యను గూర్చి, ఆ రైల్వే అధికారిని గూర్చి ఆలోచిస్తూ ఉండిపోయాను.

టి.టి.ఐ, బ్రహ్మయ్య... ఆ ఇద్దరిలో ఎవడు పెద్దబిచ్చగాడు?

'స్వాతి' మాసపత్రిక *(జూన్, 1980)*

*(నేపథ్యం : భద్రాచలం దగ్గరుండే కొత్తగూడెం నుండి వరంగల్‌కు ట్రెయిన్‌లో (సింగరేణి ఫాస్ట్ పాసెంజర్) ప్రయాణం చేస్తున్నప్పుడు కళ్ళతో చూసిన కొన్ని దృశ్యాలే ఈ కథ.)*